www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 4 అక్టోబర్ 2025

5

వైఎస్ఆర్



ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని డిఇఒ డాక్టర్ షంషుద్దీన్, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ నిత్యానంద రాజు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి కడప నగరంలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025, డిఎస్‌సి, ఎస్‌జిటి అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కోర్స్ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఇన్‌ఛార్జి వీరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధి వృత్తిలో అడుగుపెడుతున్న అందరికీ ఒక గొప్ప సువర్ణ అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశం మరి ఏ ఉద్యోగికి ఉండదని గుర్తు చేశారు. ప్రొఫెసర్ (డిస్టిక్ అబ్జర్వర్) డాక్టర్ రామకృష్ణ, డైట్ ప్రిన్సిపల్ కేదార్‌నాథ్ శిక్షణ ఆవశ్యకతను వివరించారు. ప్రదం డిస్ట్రిక్ట్ కో- ఆర్డినేటర్ కిరణ్ ప్రదం విధివిధానాలు వివరించారు. కోర్స్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ఓవరాల్ ఇన్‌ఛార్జి వీరేంద్ర ఉపాధ్యాయ వృత్తి, జాబ్ చాటు విధివిధానాలను విద్యార్థులతో ప్రవర్తించే విధాన, పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రవర్తించిన తీరును క్షుణ్ణంగా తెలియజేశారు.

రేషన్ సరుకుల్లో కోత

- 8 నెలలుగా అందని కందిపప్పు
- బియ్యం, జొన్నలు, చక్కెరకే పరిమితం
- ఊసే లేని నూనె సరఫరా
- నెలనెలా పెరుగుతున్న ఖర్చులు
- సామాన్యుడికి భారమవుతున్న జీవనం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. 8 నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నూనె సరఫరా ఒక్క నెల కూడా పంపిణీ చేయలేదు. కేవలం బియ్యం, జొన్నలు, పంచదార పంపిణీ చేస్తున్నారు. అదీ కొంతమందికి మాత్రమే సరిపెడుతున్నారు. జిల్లాలో 1,275 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 5.86 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె పంపిణీ చేయాల్సి ఉంది. 8 నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పుచారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు స్వస్తి పెట్టారు. ఈ ఏడాది జూన్ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు, నూనె కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

ఈ నెల.. రేపు నెల అంటూ కాలయాపన

వచ్చే నెల నుంచి కందిపప్పుతో పాటు రాగులు, ఇతర సరుకులు కూడా సరఫరా చేస్తామని మంత్రులు చెబుతున్నారే తప్ప ఎనిమిది నెలల నుంచి సరఫరా మాత్రం చేయలేదు. ప్రకటనలకే పరిమితమయ్యారే తప్ప ఆచరణ మాత్రం లేదు. స్థానిక ఎన్నికలు రానున్న దృష్ట్యా కందిపప్పు, రాగులను కొనుగోలు చేసే యోచనలో ప్రభుత్వ ఉన్నట్టు తెలుస్తుంది. నవంబర్ లో నైనా పేదలకు కందిపప్పు అందిస్తారా లేదా అన్న సందిగ్ధత నెలకొంది.

నాలుగైదు రోజులే పంపిణీ

ప్రతినెలా నాలుగైదు రోజులు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తున్నారు. తర్వాత స్టాక్ అయిపోయిందని రేషన్ దారులకు డీలర్లు చెబుతున్నారని విమర్శలున్నాయి. రెండో కోట స్టాక్ వచ్చిన వెంటనే ఇస్తామని చెప్తున్నారు కానీ ఆచరణ మాత్రం అంతంత మాత్రమేనని కార్డుదారులు అంటున్నారు. గత ప్రభుత్వంలో ఎన్‌యుడి వాహనాల ద్వారా రేషన్ ఇంటింటికి సరఫరా చేయడం వల్ల ప్రతి ఒక్కరికి రేషన్ అందలేదని కార్డుదారులు తెలుపుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రతి ఒక్క రేషన్ కార్డుదారునికి రేషన్ అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి నెలా 15వ వరకు సరఫరా చేయాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు. ఈ దిశగా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చొరవ తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.140 నుంచి 150 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కు లభిస్తుంది. నూనె ధరలు కూడా రూ.150 నుంచి 160 వరకు ఉంది. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నూనె పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్‌ల లో నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు.

కంది పప్పు ఇవ్వాలి..

8 నెలల నుండి కందిపప్పు నిత్యావసర సరఫరాలతో పాటు ఇవ్వకపోవడంతో పప్పుకు దూరం అవుతున్నాం.. కూలీనాలీ చేసుకుని బతికే మేము బయటి మార్కెట్లో రూ.140 నుంచి రూ.150 పెట్టి కేజీ కందిపప్పు కొనగలమా? ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు రెగ్యులర్‌గా కందిపప్పును అందించాలి.

- భవాని, వ్యవసాయ కూలీ పులివెందుల

పప్పు తినే పరిస్థితి లేదు

రేషన్‌లో కేవలం బియ్యం, జొన్నలు, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. 8 నెలల నుండి కంది బేడలు ఇవ్వడం లేదు. బయట మార్కెట్లో కందిపప్పు రేటు ఎక్కువ ఉంది. ప్రభుత్వం ఇచ్చేది తక్కువ రేటు ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం ఇచ్చే రేషన్ సరుకుల్లో కందిపప్పు, నూనె కూడా ఇవ్వాలి. కందిపప్పు బంద్ చేయడం ద్వారా సాధారణ కూలీలు, ప్రజలు పప్పు తినే పరిస్థితి కనపడటం లేదు.

- ఉమాదేవి, గృహిణి పులివెందుల

ఖర్చులు పెరిగాయి

పిల్లలు ఇంటర్, బిటెక్ హాస్టల్లో ఉండి చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో ఇంటికి వచ్చారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలు, దానికి తోడు రేషన్‌లో కోతలు వల్ల పిల్లలకు మంచి తిండి పెట్టలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ షాపులలో రాయితీలతో నిత్యావసర సరుకులు సరఫరా చేయాలి.

-సావిత్రి, చిరు వ్యాపారి, పులివెందుల

మైలవరం మరమ్మతులకు గ్రీన్‌సిగ్నల్

రూ.3.9 కోట్లు మంజూరు
ప్రతిపాదనపై చర్చ
మంత్రివర్గ సమావేశంలో ఆమోదం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మైలవరం రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన 20 అంశాలపై నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాలోని భారీ సాగునీటి ప్రాజెక్టు అయిన మైలవరం రిజర్వాయర్ మరమ్మతుకు రూ.3.19 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. రిజర్వాయర్ మరమ్మతులకు సంబంధించిన ఆధునిక రేడియల్ క్రస్ట్‌గేట్లతోపాటు ఇతర అత్యవసర ప్లేట్లు, యాంగిల్స్, హైటెన్షన్ బోల్ట్స్ అండ్ నట్లతో కూడిన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నట్లు నిర్ధారించింది. 9.9 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన మైలవరం రిజర్వాయర్ ఆపరేటింగ్ వ్యవస్థ మెరుగు పడనుంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో కురిసే భారీ వర్షాలకు రిజర్వాయర్ నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట జిల్లా నీటి పారుదలశాఖ రూ.80 కోట్లతో మైలవరం రిజర్వాయర్‌లో దెబ్బతిన్న రివిట్‌మెంట్, బ్యూటిఫికేషన్, ఫ్లడ్‌గేట్ లైటెనింగ్, కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించిన సంగతి తెలిసిందే. కేవలం మూడు శాతం మేర రూ.మూడు కోట్ల విలువ కలిగిన రిజర్వాయర్ గేట్ల పనులకు నిధుల విడుదల అంశంపై మాత్రమే చర్చించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ఖైదీతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి, జడ్జిలు

ప్రజాశక్తి - కడప

శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం స్థానిక కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ ,ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాబా ఫక్రుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఖైదీల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నో వసతులను కల్పించిందన్నారు. క్షణికావేశంలో నేరం చేసి ఇక్కడకు వచ్చిన మీరు ప్రాయశ్చిత్తంతో పరివర్తన చెందాలన్నారు. గతమంతా మర్చిపోయి ఇక్కడ నుంచి విడుదలయ్యాక ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని అందుకుని హుందాగా జీవిస్తూ సమాజంలో గౌరవ ప్రతిష్ఠలను పొందాలన్నారు. విద్య ఇతరులతో, ఎలా మాట్లాడాలి, ఎలా నడుచుకోవాలి, కోపం వచ్చినప్పుడు ఆ కోపాన్ని మనలోనే ఎలా అణచుకోవాలి అన్న సంస్కారం నేర్పిస్తుందన్నారు. కారాగారంలో ఉన్నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించాలని ఖైదీలను ఉద్దేశించి అన్నారు. ఎంఎ సోషియాలజీలో గోల్డ్ మెడల్ సాధించిన ఖైదీని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కారాగారాలలో ఖైదీలకు వివిధ రకాల వృత్తుల్లో శిక్షణ ఇప్పించి వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి సహాయాన్ని అందిస్తామని కలెక్టర్ ఖైదీలకు భరోసా ఇచ్చారు. జడ్జిలు మాట్లాడుతూ నేర ప్రవృతిని విడనాడి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారవ్వాలన్నారు. కారాగారాలలో చదువుకోవడానికి ఆసక్తి ఉన్న ఖైదీలు తాము చదువుకోవాలని ఇక్కడ అధికారుల ద్వారా తమకు దరఖాస్తు చేసుకుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా విద్యను అభ్యసించుకోవడానికి సహాయం అందిస్తామన్నారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సాయం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలు ఇచ్చారు. వంటశాలను పరిశీలించి ఖైదీలు టైం ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు తయారు చేసిన వస్తువులను, వర్కుషాప్‌లను ఆసక్తిగా తిలకించారు. బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులుగా ఉన్న జిల్లా అధికారులతో కేంద్ర కారాగారంలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం, పర్యవేక్షణ అధికారి కె.రాజేశ్వరరావు, మహిళా కారాగారం పర్యవేక్షణ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ సూపరెంట్ వెంకటేశ్వరరావు, కృష్ణవేణి, సివిల్ సర్జన్ నవీన్, బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ సభ్యులు, ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - తొండూరు



శ్రీనాథ్ (ఫైల్‌ఫొటో)

మండలంలోని మల్లేల గ్రామానికి చెందిన యువ రైతు దొడ్డిశ్రీనాథ్ (28) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు చేసుకున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో కుటుంబ భారం మోస్తూ కష్టపడి చదువు పూర్తి చేశాడు. జీవనోపాధి కోసం వ్యవసాయం వైపు మొగ్గు చూపిన శ్రీనాథ్, సాగు చేయడానికి అప్పులు చేయాల్సి వచ్చింది. తనకు ఉన్న ఐదు ఎకరాల పొలంలో చీనీ చెట్లను పెంచుతున్నాడు. కాలానుగుణంగా పంటల ఖర్చులు పెరగడం, ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. రూ. 9 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పుకు వడ్డీ పెరగడంతో అప్పులు ఇచ్చి వారి నుంచి ఒత్తిడి పెరగడం, తాను చేసిన రుణాలు ఎలా తీర్చాలో అర్థంకాక, తీవ్ర ఆవేదనకు లోనైన అతడు చివరికి శుక్రవారం విషద్రావణం సేవించి మృతి చెందాడు. ఘటనతో మల్లేల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీనాథ్ మరణం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను కంటతడి పెట్టించింది. రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

7న జడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లా జడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 7న నిర్వహించనున్నట్లు సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించే స్థాయి సంఘ సమావేశాలకు కడప, అన్నమయ్య జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 5న విజయవాడ బాలోత్సవ భవన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని డిస్కం అధ్యక్షులు శివశంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షులు సురేంద్ర ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని తెలిపారు. ఉద్యోగుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గంగయ్య, వామపక్ష, ప్రజాతంత్ర, రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు. చాలా కాలం తరువాత విద్యుత్ సంస్థలో అన్ని సంఘాలు ఆందోళనా కార్యక్రమాలు ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ పోరాట కార్యక్రమాలను బలోపేతం చేయటానికి అన్ని విద్యుత్ సంఘాలు, కార్మికసంఘాలతో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన వై.ఎస్.భారతి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని కదిరోడ్డు సమీపంలో ఉన్న విజయ గార్డెన్‌లో సోమవారం కౌన్సిలర్ సోకే వెంకట రమణ, సతీమణి రాధా కుమారుడు సోకే వంశీ, తలుపుల శశికళల వివాహం జరిగింది. శుక్రవారం వైఎస్ భారతి రెడ్డి, వైఎస్ దినేష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ ప్రమీలమ్మ , కోడి రమణ నివాసానికి వెళ్లి నూతన వధూ వరులను ఆశీర్వదించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో అల్పాహారం విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్య క్షులు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్య క్షులు పార్నపల్లె కిషోర్, కో -ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వధూవరులతో వై.ఎస్.భారతి

భూకబ్జాలపై స్పందించకపోతే పోరుబాట : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

రామాంజనేయపురంలో 424/4సి, 425 సర్వే నంబర్లలో 40 సంవత్సరాలుగా ఉన్న వంకను పూడ్చి వేసిన వ్యక్తుల మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని, భూ కబ్జాలపై అధికారులు స్పందించకపతే పోరుబాట తప్పదని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని రామాంజనేయపురం పిఎఫ్ క్వార్టర్స్ వద్ద ఉన్న ఆక్రమ ణకు గురైన వంకను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాలపై సిపిఎం ఆధ్వర్యంలో 4 రోజుల కిందట పర్యటన చేసి కడప తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ఇంతవరకు స్పందించకపోవడం దారుణమని తెలిపారు. వంకను ఆక్రమించిన వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే మేడా కన్వెన్షన్ హాల్ రోడ్డుపై రాస్తారోకోకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. 40 ఏళ్లుగా వస్తున్న వంకను మూసివేసి నీటిని కిందికి వెళ్లేందుకు వీలు లేకుండా చేశారని ఆరోపించారు. వంకకు అడ్డంగా కట్టిన గోడను, పునాదిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వంక ప్రభుత్వ స్థలం అని, ఆ స్థలం ప్రయివేట్ వ్యక్తులకు ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. వంకను కొంతమంది నాయకులు యథేచ్ఛగా బరితెగించి ఆక్రమిస్తూ ఉంటే రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. ఈ వంకను మూసి వేయడం వల్ల సెంట్రల్ జైలు, మహిళా పాలిటెక్నిక్, ఆర్సీఎం చర్చి, పోలీస్ క్వార్టర్లలో ఇండ్లలోకి నీరు చేరుతుందన్నారు. ప్రభుత్వ స్థలాలన్నీ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే పనిలో అధికార యంత్రాంగం మునిగి తేలుతున్నారని ఆయన తెలిపారు. దీన్ని బట్టి చూస్తే వంక ఆక్రమణ, ప్రభుత్వ స్థలాల కబ్జాలో రెవెన్యూ అధికారులు భాగస్వాములుగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. పాత వంక ద్వారా సక్రమంగా నీటి ప్రవాహం కిందికి వెళ్లేలా చూడాలని, కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పర్యటన కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

కార్మికుల కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్



కార్మికుల కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్

తిలక్ నగర్, అరుంధతినగర్, శంకరాపురం, మాసాపేట మున్సిపల్ కార్మికులు నివాసం ఉంటున్నటి ప్రాంతంలో సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కార్మికుల కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పనకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఇం/తీనీరింగ్ అధికారులను ఆదేశించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, శ్రీరామ్, ప్రకాష్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేశామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న కడప కార్పొరేషన్ ఎదుట మహాధర్నా చేపట్టామని తెలిపారు. కమిషనర్ కార్మిక సంఘ నాయకులతో కొన్ని అంశాలు చర్చించగా ఆ చర్చించిన అంశాల్లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారంగా తిలక్ నగర్, అరుంధతి నగర్, శంకరాపురం, క్వార్టర్స్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ కార్మికులు నివాసం ఉన్న ప్రాంతాలను సందర్శించి కార్పొరేషన్ పరిధిలో ఉన్న సమస్యలు హామీ ఇచ్చారు. ప్రధానంగా మంచినీరు డ్రెయినేజీ, వీధిలైట్లు, ఒక సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అరుంధతి నగర్‌లో నిర్మించిన డ్రెయినేజీకి కంచె వెయ్యాలని చెప్పారు. శంకరాపురం క్వార్టర్స్‌లో తాగునీరు పైపులను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, డ్రైవర్ల కార్యదర్శి సుంకరి కిరణ్, నగర కమిటీ సభ్యులు శివ, మస్తాన్, శివ, పెంచలయ్య, నివాస ప్రాంతం కార్మికులు

నూతన టెయిలింగ్ పాండ్ కోసం భూముల సర్వే

ప్రజాశక్తి - వేముల



భూముల సర్వేలో అధికారులు

మండల కేంద్రంలోని తుమ్మలపల్లి వద్ద యురేనియం ప్రాజెక్టు సంబంధించి రసాయనాలతో కూడుకున్న వ్యర్థపదార్థాలను నిల్వ చేసే నూతన టెలిగ్ పాండ్‌ను నిర్మించేందుకు అధికారులు ,రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా మబ్బు చింతలపల్లి, కె.కె.కొట్టాల గ్రామాల మధ్య ఉన్న భూములను శుక్రవారం సర్వే ప్రారంభించారు. ఈ సర్వే పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ రెడ్డిలక్ష్మి, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నిర్వహించారు. అధికారులు ప్రస్తుతం ఉన్న టైలింగ్ పాండ్‌ను కొద్దిరోజులు పాటు నూతన కట్టను నిర్మించేంత వరకు అవసర నిమిత్తం ఎత్తు పెంచేందుకు శనివారం నుంచి పోలీసులు బలగాలతో పనులు ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే నూతన టెల్లింగ్ పాండ్ కోసం భూములను సర్వే చేస్తున్నట్లు ఇరు గ్రామాల ప్రజలను మభ్య పెడుతున్నట్లు తెలిసింది. మూడు రోజుల కిందట ఉన్న టెలిగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో అన్ని చర్యలు చేపడుతున్నట్లు యురేనియం బాధిత గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తూ పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన హుటా హుటినా పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లి ప్రజల సమక్షంలో మాట్లాడారు. టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచడానికి చేసే పనులను ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వమని చెప్పారు. పూర్తిస్థాయిలో మబ్బు చింతలపల్లె, కె.కె. కొట్టాల గ్రామస్తులకు న్యాయం జరిగిన తర్వాతనే వారి భూములకు తీసుకొని ఉద్యోగాలు, పునరావసం కల్పించిన తర్వాతే టెలింగ్ పాండ్ ఎత్తు పనులను చేపట్టాలని లేని పక్షంలో అడ్డుకుంటామని ఆయన ఆర్‌డిఒతో చెప్పడంతో, అధికారులు తప్పని పరిస్థితుల్లో నూతన ట్రైలరింగ్ పాండ్‌కు భూములను సర్వే చేయడం ప్రారం భించారు. ఇదీలా ఉంటే శనివారం అధికారులు టెయిలాఇంగ్ పాండ్ కట్ట పనులు చేపడతారా లేదా అనే ఉత్కంఠ ఇరు గ్రామాల ప్రజలలో నెలకొంది.

టెంకాయల విక్రయ వేలం వాయిదా

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన టెంకాయ విక్రయం వేలం వాయిదా పడిందని దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి ఆధ్వర్యంలో తెలిపారు. ఈ వేలంపాటలో రూ. 10 లక్షలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో కొందరు పాల్గొన్నారు. బహిరంగ వేలం కాల పరిమితి ఉంటుంది. గత ఏడాది రూ. 80 లక్షలు పాట పోవడంతో అక్కడి నుంచే వేలం ప్రారంభించారు. కానీ ఎవరూ అంతమొత్తానికి పాడేందుకు ముందుకు రాకపోవడంతో దేవస్థాన సహా కమిషనర్ వెంకటసుబ్బయ్య టెంకాయలు వేలంపాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించార .తిరిగి మళ్లీ టెండర్లు ఎప్పుడు అనేది పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ట్రిపుల్ ఐటి, పోలీస్ సిబ్బంది, బ్యాంక్ అధికారులు , సూపరింటెండెంట్ సుభాష్, దేవస్థానం సిబ్బందిపాల్గొన్నారు.

గండి క్షేత్రంలో అంజన్న గ్రామోత్సవం

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో విజయదశమి పునస్కరించుకుని శుక్రవారం వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ జెవెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణ తేజ తెలిపారు. అనంతరం వీరన్న గట్టుపల్లె గ్రామం వరకు పురవీధులు గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి , ఉప ప్రధాన అర్చకులు రాజ స్వాములు, నేతృతంలో బాన సంచారాలతో, బ్యాండ్ మేళాలతో, గ్రామోత్సవం నిర్వహించారు.



వేలంపాట నిర్వహణలో ఆలయ అధికారులు

చీకటి రోజుకు నిదర్శనం

ప్రజాశక్తి - కడప

ప్రజలకు ఒక ప్రమాదకర వైరస్‌లా మారిన రాష్ట్రీయ స్వయంసేవక్ పేరిట ఒక పోస్టల్ స్టాంపు, వంద రూపాయల నాణేన్ని మత విద్వేష పాలకుడు నరేంద్ర మోడీ విడుదల చేయడం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ , ఒక చీకటి రోజుకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ళ భారతదేశాన్ని మతవిద్వేషంతో ముక్క చెక్కలు చేసిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను కీర్తిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అత్యంత హీనమైన చర్యకు పాల్పడిన ప్రధాని నరేంద్ర మోడీ నీ చట్టపరంగా శిక్షించిన తక్కువేనన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక మతరక్కసి సంస్థగా దేశం మరిచిపోలేని నేరాలు, ఘోరాలు చేసిందని ఆరోపించారు. చట్టసభల్లో అవసరమైన సందర్భాల్లో బిజెపికి ఓటు వేసి నంగనాచిలా మాట్లాడే వైసిపి నేత జగన్మోహన్‌రెడ్డి కూడా దేశానికి వెన్నుపోటుదారుగా మారిపోయారన్నారు. నేరాలు, ఘోరాలు చేస్తున్న రక్తపుటేరు చరిత్ర కలిగిన ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రత్యక్షంగా రాజముద్రవేసి, దాని పట్ల ఎంతో విధేయత చూపిస్తున్న నరేంద్ర మోడీ దేశద్రోహ ద్రోహానికి పాల్పడ్డాడని విమర్శించారు. దొంగ ఓట్లతో గద్దెనెక్కి దొంగ ప్రభుత్వాలు నడుపుతున్న నరేంద్ర మోడీ, అమిత్ షా ఆర్‌ఎస్‌ఎస్ ను ప్రజలు దేశం నుండి తరిమికొట్టే సమయం ఆసన్నమైనట్లు హెచ్చరించారు.

వరిలో యూరియా మోతాదు తగ్గించాలి : ఎఒ

ప్రజాశక్తి-కాశినాయన : వరి సాగు చేసే ప్రతి రైతు యూరియా శాతం తక్కువగా వాడితే తెగులు బారి నుంచి తప్పించుకోవచ్చని వ్యవసాయ అధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు శుక్రవారం నరసాపురం, ఉప్పలూరు గ్రామాల్లో పంటను వారు పరిశీలించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ ఎక్కడ చూసినా వరి పంటకు ఒక రకమైన పురుగు ఉండటం గమనించామని తెలిపారు. దీనివల్ల వరి పంటకు ఎక్కువ శాతం నష్టం వాటిల్లిందని చెప్పారు. అయినా తగినటువంటి మందులు పిచికారి చేయాల్సి వుస్తుందని చెప్పారు. ఇవన్నీ యూరియా ఎక్కువ శాతం వాడడం, వాతావరణ కాలుష్యం కావడం వల్ల వస్తున్నాయని చెప్పారు. వరిలాగాలకు తెల్లటి మచ్చలు రావడం ప్రతి గ్రామంలో ఉందని ఎవరూ భయపడరాదని చెప్పారు. కచ్చితంగా తగిన సమయంలో మందు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి బి.రవి రైతులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యా సంఘాల నాయకులు

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజ శేఖర్ నాయుడు,చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు నడమల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగయ్య యాదవ్, బాలాజీ రెడ్డి, వాసు, సూర్యమునిరెడ్డి, రమణ, ప్రతాప్, వెంకట్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** అకుంఠిత దీక్షాపరులు మహాత్మా గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో గురువారం మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం దక్షిణ ఆఫ్రికా నుంచి గాంధీజీ 1915లో భారతదేశానికి తిరిగి వచ్చాక ప్రారంభమైందన్నారు. అహింస, మార్గంలో చంపారం ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం ,క్విట్ ఇండియా ఉద్యమాలు నడిపారు అని గుర్తు చేశారు. అఖండ భారతావనిలో నలుమూలల పోరాటం చేస్తున్న వారిని ఒక తాటిపైకి తెచ్చి స్వాతంత్ర్య ఫలాలను అందించారు అన్నారు. అ భారతరత్న లాల్ బహుదూర్ శాస్త్రిని కాశి విద్యాపీఠం వారు ఫిలాసఫీతో పాటు ఎథిక్స్లో పట్టా పొందినందుకు శాస్త్రి అనే బిరుదు ఇచ్చారు అన్నారు. అంటే స్కాలర్ అని అర్థం. అలా వారు లాల్ బహుదూర్ శాస్త్రిగా పిలవబడ్డారు అని గుర్తు చేశారు. మన దేశ రెండవ ప్రధాని మంత్రి జై జవాన్, జై కిసాన్ అని నినాదం ఇచ్చారన్నారు. అంటరానితనం నిర్మూలనకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. హరిత విప్లవానికి చేయూతనిచ్చారని చెప్పారు.కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, రమణయ్య , మధు భాస్కర్ రెడ్డి, సాయి రమేష్, చంటి, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పోలుబోయిన కుప్పయ్య యాదవ్

ప్రజాశక్తి - అట్లూరు



విజయమ్మ, రితీష్‌రెడ్డితో కుప్పయ్య యాదవ్

బద్వేలు మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా పోలుబోయిన కుప్పయ్య యాదవ్ నియమితులయ్యారు. వారి సేవలను గుర్తించి అధికార తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్ రెడ్డి నామినేటెడ్ పదవిని ఇచ్చి గౌరవించారు. డైరెక్టర్‌గా నియమితులైన పోలుబోయిన కుప్పయ్య యాదవ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీకి విధేయంగా నడుచుకుంటానని చెప్పారు. పదవి రావడం తనకు మరింత బరువు బాధ్యతలను రెట్టింపు చేసిందన్నారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు, రితేష్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కుప్పయ్య యాదవ్‌ను మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్‌గా నియమితులైనందుకు అట్లూరు మండలం ప్రజలు , బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పేదలకు అన్నదానం చేయడం చాలా గొప్ప కార్యక్రమమని మున్సిపల్‌చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని పాత మార్కెట్ ఆంజనేయస్వామి గుడి వద్ద వైసిపి నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓ.రసూల్ మనవరాలు ఓతూరు హైరా పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్‌తోపాటు పట్టణ అధ్యక్షులు గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, మాజీ వైస్ చైర్మన్ సర్వత్వం రెడ్డి, గ్రూప్ టెంపుల్స్ చైర్మన్ సుధీకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ తన మనవరాలు హైరా మొదటి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీ రంగనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్య, పులివెందుల పట్టణ బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు సోపాల వీర, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, వీరారెడ్డి, దాసరి ఈశ్వరయ్య, పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, దాత రసూల్

క్రైం కార్నర్

లారీ డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి - ముద్దనూరు

లారీ బొగ్గు లోడుతో వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపు తప్పి బ్రిడ్జిని ఢీ కొట్టింది. మంటలు చెలరేగి క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ అరెర్‌సంజయ్ (32) సజీవ దహనం అయ్యాడు. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం బాగల్ కోట్ జిల్లాలోని హిరెకోదగల్లి మండలం గుగల్మరి గ్రామానికి చెందిన సంజయ్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 1న క్రిష్ణపట్నం పోర్ట్ నుంచి లారీలో బొగ్గులోడు చేసుకొని హోస్పెట్ దగ్గర ఉన్న కిర్లోస్కర్ స్టీల్ ప్లాంట్‌కు ముద్దనూరు మీదుగా బయలుదేరారు. లారీ బుధవారం రాత్రి మండలంలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో రాగానే లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జిని ఢీ కొట్టి లోపలికి దూసుకెళ్లింది. దీంతో క్యాబిన్‌లో మంటలు చెలరేగి డ్రైవర్ అరెర్ సంజయ్ మంటల్లో చిక్కుకుని దహనమయ్యాడు. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేశారు. మృతుని అన్న మంజునాథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కేతవరం రోడ్డు వద్ద గురువారం రాత్రి స్కూటర్ ఢీకొని గాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. కేతవరం రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న పందిటి వరప్రసాద్ (70) రోడ్డు దాటుతుండగా ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు కాగా వారికి వివాహమైంది. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం



విజేలతో మున్సిపల్ కమిషనర్, అర్బన్ సిఐ, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

క్రీడలు మానసిక ఉల్లాసానికి, దృఢత్వానికి ఎంతో అవసరమని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహరెడ్డి, అర్బన్‌సిఐ లింగప్ప పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతి, దసరా పండుగను పురస్కరించుకొని డివైఎఫ్ఐ అధ్వర్యంలో మూడు రోజులపాటు బద్వేలులో నిర్వహించిన జిల్లా స్థాయి భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం అతిథుల చేతుల మీదుగా కప్పులు, మెడల్స్ తో పాటు విజేతలకు రూ.15 వేలు , రన్నర్‌కు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంచే క్రీడలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకత్వానికి అభినందనలు అన్నారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా సన్మార్గంలో నడిచి పుట్టిన దేశానికి, ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు, ప్రఖ్యాతిని తేవాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా యువత ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల గురించి సమాచారం ఏదైనా ఉంటే పోలీసు వారికి తెరపాలని, ఆ శక్తి ఒక యువతకి మాత్రమే ఉందని చెప్పారు.యువత మున్సిపల్, పోలీసు శాఖ కలిసి బద్వేలు అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ముడియంచిన్ని, వీరణాల శివకుమార్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్య పై పోరాడుతూ అందరికీ విద్యా, ఉపాధి లక్ష్యం కోసం పని చేస్తుందన్నారు. మహనీయుల, స్వాతంత్ర్య, సమర యోధులు జయంతులు పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే దేశ స్వాతంత్ర్యం కోసం అమరుడైన విప్లవ యువ కిషోరం షహీద్ భగత్ సింగ్ జయంతిని చెడుపై మంచి సాధించిన దసరా పండుగను పురస్కరించుకొని బద్వేలులో భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంటు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా స్ఫూర్తితో నిర్వహించారని, పాల్గొన్న క్రీడా కారులందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేలు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్ ఎస్.కె.ఆదిల్, పట్టణ నాయకులు ఓబుల్ రెడ్డి, సుధాకర్ సురేష్, నాగేంద్ర, సుబ్రహ్మణ్యం, చరణ్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో రైతులకు లబ్ధి

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

ప్రజాశక్తి- కడప అర్బన్

రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాలకు జిఎస్‌టి తగ్గించడంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం 'సూపర్ జిఎస్‌టి..సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై కలెక్టరేట్ నుంచి సెవెన్ రోడ్స్, ఆర్‌టిసి బస్టాండ్ వరకు రైతులకు, ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన జిఎస్‌టి విధానం వల్ల రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, డ్రిప్పు స్ప్రింకర్లు మీద 5 శాతం జిఎస్‌టి మాత్రమే ఉంటుందన్నారు. సదవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

జమ్మలమడుగు : దేశంలోని వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమల రంగం, చేనేత శాఖ తదితర వర్గాల వారు ఉపయోగించే వివిధ రకాల వాహనాలు, పనిముట్లు యంత్రాలకు కొనుగోలులో జిఎస్‌టి తగ్గించారని, చాలావరకు లబ్ధి చేకూరుతుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిఒ కార్యాలయ ఆవరణంలో సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ఎంపిడిఒ కార్యాలయ సవాభవనం వరకు సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, నియోజక వర్గ జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, ఆర్‌డిఒ ఆదిమూలం సాయిశ్రీ, వ్యవసాయ, జౌళి, పాడి పరిశ్రమల శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జౌళి శాఖ ఏడీ పిచ్చేశ్వరరావు, నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీలు అనిత, రామ్మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, వ్యవసాయ అధికారులు శ్రీకాంత్ రెడ్డి వెంకటకృష్ణారెడ్డి, కూటమి నాయకులు బేపారి మహమ్మద్ రఫీ, భీమగుండం రాజారెడ్డి, నియోజకవర్గ అధికారులు రైతులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి

వివరాల సేకరణపై ఆదేశాలు రాలేదు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు

ఉల్లి పంటకు హెక్టార్‌కు రూ. 50 వేలు నష్టపరిహారం అందించేందుకు వివరాలు సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని హార్టికల్చర్ అధికారి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మైదుకూరు మండల సభా భవనంలో ఎంపిపి థామస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంజికుంట సర్పంచ్ జయభారత్‌రెడ్డి ఉల్లి రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారం ఎప్పుడు అందిస్తారని కోరారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి కేవలం కర్నూలు జిల్లాలో మాత్రమే నష్టపరిహారం అందించే ఉత్తర్వులు అందాయని మన జిల్లాలో అలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అధికారుల నుంచి ఆదేశాలు వస్తే రైతులకు తెలియజేస్తామన్నారు. ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల నుంచి సభ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య, పారిశుధ్యంపై ఎప్పటికప్పుడూ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సరఫరా చేసే ఎద సూదులు పనిచేయడం లేదని తద్వారా పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పశు వైద్య అధికారి గురివిరెడ్డి మాట్లాడుతూ ఎదసూదులు 35 నుంచి 40 శాతం మాత్రమే పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. పశువుకు ఎదవ వచ్చిన సమయంపై కూడా ఆధారపడుతుందన్నారు. అంగన్వాడీ భవనానికి సంబంధించి చేపట్టిన బిల్లులు రావడంలో ఆలస్యం అవుతుందని, ఆర్అండబి రోడ్డు వెంబడి కంపచెట్లు పెరిగాయని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అన్నలూరు సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమానికి ఆర్అండ్‌బి అధికారులు, ట్రాన్స్‌కో సిబ్బంది గైర్హాజరు కావడం పట్ల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప ఎంపిపి రఘురామి రెడ్డి, ఎంఇఒ పద్మలత, ఉపాధి ఎపిఒ రామచంద్రారెడ్డి, కెసి కెనాల్ ఎఇ గురు మోహన్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ భరత్, వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పల్వరైజింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

బండి జకరయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ శుక్రవారం కడప జిల్లా సిద్ధవటం మండలం నేకనాపురం గ్రామ పరిధిలో మైక్రో పల్వరైజింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ గౌడ్, మల్లెం విజయభాస్కర్, సత్తార్, కులాయప్ప,అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, పాల్ సుధాకర్, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, లక్ష్మయ్య ,హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలి

ప్రజాశక్తి -సింహాద్రిపురం

ప్రజలకు ఉపయోగపడే పనులను చేయాలని ఉపాధి ఎపిఒ జయ భారతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీలలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం 2026- 27వ ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రణాళిక, పనుల గుర్తింపు , ఆమోదానికి సంబంధించిన చట్టబద్ధమైన గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ పనులు గుర్తించే సమయంలో ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని టౌన్ ఫీడర్, అన్నవరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఎఇ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని తెలిపారు. మైదుకూరు మండల పరిధిలోని నంద్యాలం పేట, ఉప్పుగుంటపల్లె సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవి సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు ఉంటాయన్నారు. వనిపెంట, ఎల్లంపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

సీనియర్ న్యాయవాదికి సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా ప్రముఖ సీనియర్ న్యాయవాది, టిడిపి పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరిబాబును శుక్రవారం బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ప్రెసిడెంట్ సోమేశుల శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. న్యాయవాదులు దాసరి బాబుకు శాలువా, పూలమాలతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో పదవి అలంకరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బార్ అసోసియేషన్ నాయకులు ఆర్.శ్రీనివాసులు, కామనూరు శ్రీనివాసులు, ఆవుల వెంకటరమణ, మూలె నాగిరెడ్డి, కోనేటి శ్రీనివాసులు, బాల వెంకటయ్య, భాస్కర్ రెడ్డి, జెకె చారి పాల్గొన్నారు.

మోడీ వరుస విజయాలు ఓట్ల చోరీ ఫలితమే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మోడీ వరుస విజయాలు ఓట్ల చోరీ ఫలితమేనని జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఓటు చోరీ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నాడీ, ఓటరు జాబితా పై సమగ్రంగా రాహుల్ గాంధీ అధ్యయనం చేశారన్నారు. దేశం మొత్తం బిజెపి ఎన్నికలు గెలుస్తుంది అంటే అది కేవలం ఓట్లు చోరీతోనే అని రాహుల్ గాంధీ సాక్షాలతో సహా నిరూపించారన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందన్నారు. ఎన్నికలు సరైన విధానంలో జరగనప్పుడు ఇలాంటి పరిణామాలే దేశంలో తలెత్తుతాయన్నారు. ఇవిఎం మిషన్లు హ్యాక్ చేసి, డూప్లికేట్ ఓట్లు నమోదు చేసుకొని, దొంగ ఓట్లను బిజెపి బనాయించిందని చెప్పారు. జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలందరికి తెలిసే విధంగా, సామాజిక మాధ్యమాలు, పత్రికలు, కరపత్రాల ద్వారా, టీవీల ద్వారా ఓటు చోరీని ప్రజలకు తెలియజేస్తామని తెలియచేశారు. ఓట్లు చోరీ జరిగితే ప్రజలకు విలువ ఉండదు.. నాయకులకు బాధ్యత ఉండదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ప్రకాశం, వాసు, సాయి, ఆంజనేయులు, రాము, వరప్రసాద్, ప్రసాద్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం భూమాయపల్లె గ్రామ సచివాలయ కార్యాలయంలో 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టనున్న పనులు, పనుల ప్రయోజనాల గురించి చర్చించారు. పంట కాలవల అభివృద్ధి, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటుట, పూడికతీత పనులు తదితర పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగ ముని, ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అన్యాయాన్ని డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-అట్లూరు

వైసిపి నాయకులకు, కార్యకర్తలకు జరిగిన అన్యాయాన్ని డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం ఆమె డిజటల్ బుక్, క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరిపాలనా వదిలేసి రెడ్ బుక్‌తో పరిపాలన చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వైసిపి నాయకులను, కార్యకర్తలను, సానుభూతి పరుల ఆస్తులను ధ్వంసం చేయడంతోపాటు, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతన్నారని వాపోయారు. వారి ఆగడాలను అడ్డుకట్ట వేసేందుకు, కార్యకర్తలను ఆదుకోవడానికి, భరోసా ఇచ్చేందుకే జగనన్న డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. డిజిటల్ బుక్‌లో నమోదు చేసిన ప్రతి అంశాన్ని, వైసిపి అధికారంలోకి రాగానే ఎవరైతే కార్యకర్తలు, నాయకులు. ఇబ్బంది పడ్డారో వారి అందరినీ ఆడుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, నియోజక వర్గం అధ్యక్షులు రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు బాల ముని రెడ్డి, మల్లికార్జునరెడ్డి,పెద్ద పోలి రెడ్డి, మాధవ రెడ్డి,జిల్లా కార్యదర్శి బ్రహ్మా నంద రెడ్డి, భాస్కర్ రెడ్డి, నరసారెడ్డి ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ముద్దనూరు మండల సమావేశం

ప్రజశక్తి - ముద్దనూరు : స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయంలో శనివారం ఉపాధ్యక్షులు పాలగిరి వీర రేణుక, వెన్నపూస పుష్పలత అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాధా కృష్ణవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి, రోడ్లు, విద్యుత్, పశు సంవర్ధక వంటి అంశాలపైన చర్చించనున్నట్లు చెప్పారు. ఆయా శాఖల మండల అధికారులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ సూచించారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా గండికోట శివ

ప్రజాశక్తి - వేంపల్లె



ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా గండికోట వెంకట శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయి బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముసిడిపల్లె రమణ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమా వేశంలో వేంపల్లెకు చెందిన గండికోట శివను జిల్లా కన్వీనర్‌గా ఎన్నుకున్నట్లు శుక్రవారం రాష్ట్ర అధ్య క్షులు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర సంఘం నియమాలను అనుగుణంగా నాయిబ్రాహ్మణుల సంక్షేమం కోసం అన్ని విషయాలలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అండగా ఉంటూ సంఘ పటిష్టతను తమ వంతు కృషి చేస్తానని జిల్లా కన్వీనర్ పేర్కొన్నారు. తన నియామకానికి అయినందుకు సహకరించిన రాష్ట్ర నాయీ బ్రహ్మణ సం ఘానికి కృతజ్ఞతలు తెలిపారు. పదవికి వన్నే తెచ్చేందుకు కృషి చేస్తానని హమి ఇచ్చారు. అందరి సహకారంతో నాయీ బ్రాహ్మణ సంఘానికి బలోపేతం చేయ డంతో పాటు నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వ పథకాలు అమలు కృషి చేస్తానన్నారు.

యువకుల హల్‌చల్

ప్రజాశక్తి - వేముల : మండలం కేంద్రంలోని మబ్బుచింతలపల్లిలో కొంతమంది యువకులు మారుణాయుధాలతో బుధవారం గ్రామంలో తిరుగుతూ హల్ చల్ చేశారు. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. యురేనియం ప్రాజెక్టులోని అండర్ గ్రౌండ్‌లో మంగళవారం ఇద్దరు ఉద్యోగుల మధ్య చోటు చేసుకున్న చిన్న వివాదం బుధవారం దుమారం లేపింది. మబ్బు చింతల పల్లెలో ఓ ఉద్యోగిపై దాడి చేసేందుకు మరో ఉద్యోగి, అదే గ్రామానికి చెందిన యువకుడు తన తోటి స్నేహితులతో కలిసి గ్రామంలో మారణాయుధాలతో తిరుగుతూ హల్‌చల్ చేశారు. గమనించిన కొంతమంది గ్రామస్తులు విషయాన్ని స్థానిక పోలీసులకు తెలపడంతో వారు హుటా హుటానా గ్రామానికి చేరుకొని ఆ యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులతో ఆరా తీసేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చీనీ రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-లింగాల : పులివెందుల నియోజకవర్గంలో చీనీ రైతుల పరిస్థితి రోజు రోజుకూ దయనీయంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మండల పరిధిలోని చిన్నకూడలలో చీనీ పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చీనీ రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు పెట్టిన పెట్టుబడులు రాక చీనీ పంటలను రైతులు తొలగిస్తున్నారని చెప్పారు. కోల్ట్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు చీనీ, అరటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగాల మండల అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షులు శివ కళ్యాణ్ పాల్గొన్నారు.